సాక్షి
సంగారెడ్డి

గురువారం । 22 । జూన్ । 2023



నలుగురిని బలిగొన్న క్షణికావేశం

క్షణికావేశం నాలుగు నిండు ప్రాణాలను బలిగొంది. భార్యాభర్తల మధ్య జరిగిన చిన్నపాటి గొడవ వారితో పాటు వారి పిల్లలు బలవడం కలకలం రేపింది. 4లో



ఆర్థిక సాయం ఇప్పిస్తానని..

నిరక్షరాస్యుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని మోసం చేశాడు ఓ ప్రబుద్ధుడు. ఈ ఉదంతం పెద్ద చింతకుంటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 4లో

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 28 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 25 మందికి చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

తార కళాశాలకు రాష్ట్ర స్థాయి అవార్డు

సంగారెడ్డి టౌన్: న్యాక్ సందర్శనలో ఏ ప్లస్ గ్రేడ్ సాధించినందుకు తార కళాశాలను అత్యున్నత కళాశాలగా గుర్తించి రాష్ట్ర స్థాయి అవార్డును ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్‌కు రవీంద్ర భారతిలో అందజేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన విద్యా దినోత్సవంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా తార కళాశాలకు మూడు అవార్డులు అందజేశారు.

పంటలు సమృద్ధిగా పండాలి



శివాలయంలో పూజలు చేస్తున్న మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్

సదాశివపేట(సంగారెడ్డి): వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ ప్రజలు దేవాలయాల్లో పూజలు చేయాలని తెలంగాణ మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీ రాజ్ పిలుపు ఇచ్చారు. బుధవారం పట్టణంలోని భ్రమరాంభ సమేత శివాలయంలో కొలువైన శివుడికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు కురవాలని దేవాలయల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సమాఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిశు, స్త్రీ సంక్షేమానికి గండి



సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

సంగారెడ్డి టౌన్: సమగ్ర శిశు, స్త్రీ సంక్షేమానికి గండికొట్టేందుకు జరుగుతున్న కుట్రలను ఛేదించేందుకు సమరశీలంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పిలుపు ఇచ్చారు. ఐసీడీఎస్ పరిరక్షణ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన అంగన్‌వాడీ ఉద్యోగుల జీపుజాత బుధవారం సంగారెడ్డి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో చుక్క రాములు మాట్లాడుతూ మోడీ తొమ్మిదేళ్ల పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేశారన్నారు. సమగ్ర శిశు, స్త్రీ సంక్షేమానికి ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ సంస్థకు కేంద్రం నిధుల్ని తగ్గిస్తోందన్నారు. జులై 10వ తేదీన అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నల్లచీరలు ధరించి నిరసన ర్యాలీలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియాన్ రాష్ట్ర కోశాధికారి సునీత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నర్సమ్మ, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీపై ఎరువులు, సాగు పనిముట్లు ఇవ్వాలి

సంగారెడ్డి టౌన్: రైతులకు కొత్త రుణాలు వెంటనే ఇవ్వాలని విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి జయరాజు అన్నారు. బుధవారం కొండాపూర్ మండలం తేర్పులు గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీని నాలుగు విడతలుగా చేస్తామని సీఎం ప్రకటించారని, కానీ ఇప్పటి వరకు చేయలేదన్నారు. వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కూరాకుల రాజయ్య, నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సంగారెడ్డి టౌన్: అర్హులైన పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. బుధవారం కేవల్ కిషన్ భవన్‌లో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నా ఇళ్లు రాక తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. అర్హులైన వారికి ఇళ్లు లేదా ఇంటి స్థలం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమేల మాణిక్, నాయకులు రాజయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో పొడిగింపుపై ఆశలు!

- నేడు జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటన
- 2019 ఎన్నికల తర్వాత తొలిసారి పటాన్‌చెరు రాక
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి హరీశ్‌రావు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: పటాన్‌చెరులో ఏర్పాటు చేయనున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు గురువారం జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటనపై జిల్లా వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టేందుకు నారాయణఖేడ్ వచ్చిన సందర్భంగా జిల్లాపై వరాలు కురిపించారు. ప్రతీ గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ అభివృద్ధికి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ మంజూరు చేశారు. ఈసారి కూడా కేసీఆర్ పర్యటనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. 2019 ఎన్నికల ప్రచారంలో పటాన్‌చెరు వచ్చారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి పటాన్‌చెరు వస్తున్నారు. మినీ ఇండియాగా భాసిల్లుతున్న జిల్లా అభివృద్ధికి ఆయన వరాలు కురిపిస్తారనే ఆశతో జిల్లా వాసులు ఉన్నారు. కాగా సీఎం పర్యటనకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు.

పాలిటెక్నిక్, మహిళా డిగ్రీ కాలేజీలు

జిల్లాకు ఇప్పటికే మెడికల్ కాలేజీ మంజూరు చేసిన సీఎం పటాన్‌చెరుకు పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నారాయణఖేడ్‌లో మహిళా డిగ్రీ కాలేజీ, మహిళా జూనియర్ కాలేజీని ఏర్పాటు చేయాలనే విజ్ఞప్తులు వస్తున్నాయి. జిల్లా పర్యటన సందర్భంగా వీటిని మంజూరు చేయాలని డిమాండ్ వ్యక్తమవుతోంది.

మియాపూర్ నుంచి...

మియాపూర్ వరకు ఉన్న మెట్రో రైలు ప్రాజెక్టును పటాన్‌చెరు వరకు పొడిగించాలని జిల్లా వాసులు కోరుకుంటున్నారు. దీన్ని సంగారెడ్డి వరకు కూడా పొడిగించాలనే డిమాండ్ ఉన్నప్పటికీ, కనీసం పటాన్‌చెరు వరకు పొడిగించాలనే డిమాండ్ ఉంది. మియాపూర్ నుంచి బీహెచ్ఈఎల్ చౌరస్తా వరకు సుమారు ఏడున్నర కిలోమీటర్ల దూరం ఉండే ఈ రూట్‌లో ట్రాఫిక్ ఎక్కువ. సాయంత్రం వేళల్లో, వారాంతంలో పటాన్‌చెరు రావాలంటే ఒక్కోసారి గంటకు మించే సమయం పడుతుంది. ఈ సమస్య పరిష్కారినికి మెట్రో విస్తరణ కోసం మెట్రో సాధన సమితి పోరాటం చేస్తోంది. ఇందుకోసం సంతకాల సేకరణ కూడా చేపట్టింది. ఈ క్రమంలో గత ఏడాది మెట్రో రెండో దశ విస్తరణ అంశం తెరపైకి వచ్చింది. దీంతో జిల్లావాసులకు మెట్రో ఆశలు చిగురించాయి. ఇప్పుడు సీఎం జిల్లా పర్యటన సందర్భంగా రెండో దశ మెట్రో విస్తరణపై ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పంట నష్టపరిహారం కోసం..

గత రబీ సీజన్‌లో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వానకు వేలాది ఎకరాల్లో సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లింది. రెండు, మూడు విడతలుగా పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే తొలి విడతలో సుమారు 3,093 మందికి పరిహారం మంజూరు చేసింది. కానీ రెండో విడతలో సుమారు నాలుగు వేల మందికి పంట నష్ట పరిహారం ఇంకా విడుదల కాలేదు. ఈ పరిహారం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.



మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు

కొల్లూరులో నిర్మించిన ఇళ్ల సముదాయం ఆసియాలోనే అతిపెద్దది

మంత్రి హరీశ్‌రావు

పటాన్‌చెరు టౌన్: కొల్లూరులో 124 ఎకరాల్లో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఆసియాలోనే అతిపెద్ద టౌన్‌షిప్ అని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం పటాన్‌చెరులో సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయనున్న సూపర్ స్పెషలిటీ ఆస్పత్రి, సభా స్థలాన్ని ఎమ్మెల్యేలు మహిపాల్ రెడ్డి, క్రాంతి కిరణ్, మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక వసతులు అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, కలెక్టర్ శరత్, ఎస్పీ రమణకుమార్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గురువారం కొల్లూరులో నిర్మించిన ఇండ్ల సముదాయాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని, ఈ సముదాయం ఆసియాలోనే అతిపెద్దదని, 124 ఎకరాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం నిర్మించినట్లు తెలిపారు. కేసీఆర్ పటాన్‌చెరులో రూ.183 కోట్లతో నిర్మించనున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు శంకుస్థాపన చేస్తారన్నారు. ఆస్పత్రి రాకతో ఉచిత వైద్యం ఈ ప్రాంత కార్మికులకు అందుబాటులోకి రానుందన్నారు. సీఎం కేసీఆర్ సంగారెడ్డి జిల్లాకు మెడికల్ కాలేజీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆరు వేల మందితో సభ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి సూచించారు. కాంగ్రెస్ నాయకులకు పదవులు తప్ప మరేమీ అవసరం లేదని, కాంగ్రెస్ పార్టీ శతాబ్ద కాలం దగా చేసిందన్నారు. అభివృద్ధి చరిత్ర తమదైతే, అవరోధం చరిత్ర కాంగ్రెస్‌దన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరుకు పాదయాత్రగా..

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో బీఆర్ఎస్, ఎన్ఎంఆర్ యువసేన నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ముందుగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. బహిరంగ సభకు పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలోని మల్లన్న దేవాలయం నుంచి గురువారం ఉదయం బీఆర్ఎస్, ఎన్ఎంఆర్ నాయకులు, కార్యకర్తలు పాదయాత్రగా పటాన్‌చెరు చేరుకోనున్నట్లు చెప్పారు. రెండు పడక గదుల ఇళ్లు, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభం చేయడం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుతో ఈ ప్రాంత రూపురేఖలే మారనున్నాయన్నారు.



మాట్లాడుతున్న నీలం మధు ముదిరాజ్

సీఎం సభకు ఏర్పాట్లు పూర్తి



సీఎం బహిరంగ సభకు సిద్ధమైన వేదిక



ఏర్పాట్ల వివరాలను తెలుసుకుంటున్న మంత్రి హరీశ్ రావు

పటాన్‌చెరు టౌన్: సీఎం కేసీఆర్ పటాన్‌చెరు పర్యటనకు సర్వం సిద్ధం చేశారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వాహనదారులు సర్వీస్ రోడ్ మీదగా వెళ్లాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. సీఎం పర్యటన నేపథ్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు రోడ్ల కిరువైపులా, డివైడర్లను భారీ ఫ్లెక్సీలు, హోర్డింగ్, పార్టీ జెండాలతో అలంకరించారు. వంద మంది కూర్చునేలా భారీ వేదికను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కలెక్టర్ డాక్టర్ శరత్, ఎస్పీ రమణ కుమార్, డీఎస్పీ భీంరెడ్డి, పటాన్‌చెరు సీఐ వేణు గోపాల్ రెడ్డి, అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి, క్రైం సీఐ లాలు నాయక్, జిన్నారం సీఐ వేణు కుమార్, బొల్లారం సీఐ సురేందర్ రెడ్డి, ఎస్ఐలతో కలిసి పనులను పర్యవేక్షిస్తున్నారు.

1500 మందితో బందోబస్తు

సీఎం బహిరంగ సభకు భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎస్పీ రమణ కుమార్‌తో పాటు నలుగురు అదనపు ఎస్పీలు, పది మంది డీఎస్పీలు, 48 మంది సీఐలు, 105 మంది ఎస్ఐలు, 1200 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, వంద మంది హోంగార్డులు స్పెషల్ పార్టీ పోలీసులు విధులు నిర్వహించనున్నారు.

పర్యటన ఇలా..

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సీఎం కేసీఆర్ గురువారం ఉదయం 10 గంటలకు బేగంపేటలోని ప్రగతిభవన్ నుంచి రోడ్డు మార్గం గుండా 10.30 గంటలకు రామచంద్రాపురం మండలం కొల్లూరు చేరుకుంటారు. అక్కడ డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రారంభిస్తారు. 11.10 గంటలకు కొల్లూరు నుంచి కొండగల్ వెళ్లారు. అక్కడ రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి ఉద్యోగులతో మాట్లాడుతారు. 12.30 గంటలకు పటాన్‌చెరువు చేరుకుంటారు. అక్కడ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి శంకస్థాపన చేస్తారు. అనంతరం బహిరంగసభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. సభ అనంతరం తిరిగి హైదరాబాద్ వెళతారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వండి

పటాన్‌చెరు: కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను స్థానిక పేదలకు కేటాయించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి ప్రభుత్వం డిమాండ్ చేశారు. బుధవారం ఉప తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం(జహీరాబాద్): రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయంలో ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు అనంతరం దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కేతకి ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించటం జరిగిందని, నిధులు మంజూరైన వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, సర్పంచ్ జగదీశ్వర్, మండల ప్రత్యేకాధికారి జయదేవ్, ఆలయ చైర్మన్ నీల వెంకటేశం, ఈఓ శశిధర్, ఎంపీడీఓ సుజాత, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, నాయకులు, అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల



యోగా చేస్తున్న కేంద్ర పశుసంవర్ధక శాఖమంత్రి పురుషోత్తం రూపాల

కంది(సంగారెడ్డి): ప్రతీరోజు యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని కేంద్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కందిలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం నిద్రలేచిన తర్వాత యోగా చేస్తే మానసిక ప్రశాంతతతోపాటు రోగ నిరోధకశక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేశ్వర్ రావు దేశ్ పాండే, జిల్లా నాయకులు కె.జగన్, పోచారం రాములు, చంద్రశేఖర్ గుప్తా, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ దేవాలయంలో ఎమ్మెల్యే, కలెక్టర్ పూజలు



గణేష్ దేవాలయంలో కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

పటాన్‌చెరు: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం రుద్రారం గణేష్ దేవాలయాన్ని కలెక్టర్ శరత్, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి, సర్పంచ్ సుధీర్ రెడ్డి తదితర ప్రముఖులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కను నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందన్నారు.

నల్లవాగు ప్రాజెక్టుకు నీటి తరలింపు సర్వే



సర్వే పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండలం కారముంగి శివారు మంజీరా నది నుంచి సిర్గాపూర్ మండలం నల్లవాగు ప్రాజెక్టుకు నీటిని తరలించే సర్వే పనులను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సర్వే పనులకు రూ.9 లక్షలు మంజూరు చేసిందన్నారు. సర్వే నివేదిక అనుకులంగా వస్తే నీటిని తరలింపునకు దాదాపు రూ.90 నుంచి రూ.120 కోట్ల వరకు నిధులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. కారముంగి నుంచి కరస్‌గుత్తి వరకు మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేసి అక్కడి నుంచి నల్లవాగు నింపే ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిర్గాపూర్ జెడ్పీటీసీ రాఘవరెడ్డి, నర్సింహారెడ్డి, మండల రైతుబంధు సమన్వయ సమితి కన్వీనర్ నందుపాటిల్, కరస్‌గుత్తి సర్పంచ్ సంజీవ్ రెడ్డి, దిలీప్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

రూ.7.39కోట్ల చెక్కులను రైతులకు అందచేత

మనూరు మండలం బోరంచలో నిర్మిస్తున్న బసవేశ్వర ప్రాజెక్టులో భూమిని కోల్పోతున్న 33 మంది రైతులకు రూ.7.39 కోట్ల చెక్కులను ఎమ్మెల్యే బుధవారం అందజేశారు. అనంతరం ప్రాజెక్టు నిర్మాణ పనులకు పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాములు, సర్పంచ్ రేణుక పండరి, అశోక్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

ఈవీఎంల పరిశీలన

సంగారెడ్డి టౌన్: సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా ఈవీఎంల పరిశీలన ప్రక్రియను చేపట్టింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పట్టణంలోని ఈవీఎంల గోదాంను బుధవారం కలెక్టర్ శరత్ సందర్శించి ఈవీఎంను పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శలకు అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు.

చల్లబడిన వాతావరణం



సంగారెడ్డిలో కురుస్తున్న వర్షం

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి పట్టణ కేంద్రంలో వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం 30 నిమిషాల పాటు వర్షం కురియడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోయారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న సునీత లక్ష్మారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మహిళల ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి అన్నారు. బుధవారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో వారికి ఉచిత కుట్టు శిక్షణ ఇప్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. 45 రోజుల పాటు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. వారికి ఉపాధి కల్పించేందుకు ఐకేపీ ద్వారా అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. స్త్రీనిధి ద్వారా కుట్టు మిషన్లు పొందేందుకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. బీసీ కార్పొరేషన్‌లో రూ.లక్ష ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వావిలాల నర్సింలు, సర్పంచ్ కొన్యాల వెంకటేశం, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకటరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి, ఐబీఏపీఎం శ్రీదేవి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, కుట్టు శిక్షణ సంస్థ నిర్వాహక ఎన్జీవో ప్రతినిధి సునీత, నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఏడోరోజు 656 మంది హాజరు



సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో అభ్యర్థులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల తుదిరాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువీకరణ ప్రతాల పరిశీలన ఏడో రోజు 700 మంది అభ్యర్థులకి 656 హాజరైనట్లు ఎస్పీ యం.రమణకుమార్ బుధవారం తెలిపారు. వెరిఫికేషన్‌కు వచ్చే అభ్యర్థులు తప్పనిసరిగా వెరిఫికేషన్ లెటర్, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో తమకు కేటాయించిన రోజున హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.ఉషా విశ్వనాథ్, పాలనా విభాగం అధికారి కల్యాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై హెచ్‌ఆర్‌సీలో ఫిర్యాదు

నాంపల్లి: బీఆర్ఎస్‌నేత నీలంమధు ముదిరాజ్, అతడి అనుచరులపై దాడికి పాల్పడిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆలిండియా ఓబీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు శివ ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన నాంపల్లిలోని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా నీలం మధు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఎమ్మెల్యే అనుచరులు తొలగించారని, అంతటితో ఆగకుండా నీలం మధు, అతని అనుచరులపై దాడి చేశారన్నారు.

బావ ప్రాణాలను రక్షించిన బావమరిది

సిద్దిపేటరూరల్: తన బావకు ప్రమాదవశాత్తు మెడ తెగగా ఈఎంఆర్‌ఐ చికిత్స అందించి బావమరిది రక్షించుకున్నాడు. ఈ ఉదంతం మండలంలోని వెంకటాపూర్‌లో చోటుచేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్ గ్రామానికి చెందిన దబ్బెట మహేష్.. తన బావ బాలరాజుకు ప్రమాదవశాత్తు మెడ తెగింది. వెంటనే మహేశ్ ఈఎంఐఆర్ ప్రథమ చికిత్స చేసి రక్తం కారడాన్ని నియంత్రించి, హుటాహుటిన సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి సమయానికి తీసుకొచ్చాడు. ప్రథమ చికిత్స చేసి తీసుకొచ్చిన మహేశ్‌ను వైద్యులు అభినందించారు. అనంతరం మహేశ్ మాట్లాడుతూ నెల రోజుల క్రితం పోలీస్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించిన క్యాంపులో 22 రకాల ప్రాథమిక చికిత్సలపై శిక్షణ తీసుకున్నానన్నాడు. ఈ క్రమంలోనే తన బావకు ప్రథమ చికిత్స చేయగాలిగానన్నాడు.

తుక్కు దుకాణంలో అగ్ని ప్రమాదం



దట్టమైన పొగలు వెలువడుతున్న దృశ్యం

జిన్నారం(పటాన్‌చెరు): బొంతపల్లి పారిశ్రామిక వాడలోని ఓ స్క్రాబ్ దుకాణంలో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. దీంతో దట్టమైన పొగ కమ్ముకొని మంటలు ఎగిసిపడ్డాయి. సమీపంలోని పరిశ్రమల సాయంతో మంటలు ఆర్పివేశారు. దీంతో ఎలాంటి ప్రాణహానీ జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రసాయన డ్రమ్ములు దుకాణంలో ఉండటంతో రసాయనాల మధ్య రాపిడి జరిగి మంటలు అలుముకున్నాయని స్థానికులు చెబుతున్నారు. నిబంధనలను పాటించకుండా స్క్రాబ్ దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

డంప్‌యార్డ్‌లో మంటలు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి పరిశ్రమలవాడలో గల డంప్ యార్డ్‌లో బుధవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చేసుకుంది. దీంతో మంటలు చెలగేరి, దట్టమైన పొగ కమ్ముకొంది. స్థానికులు నర్సాపూర్ ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో వారొచ్చి 4 గంటలపాటు శ్రమించి మంటలను ఆర్పారు. ఈ ఘటనపై అధికారులు విచారణ చేస్తున్నారు.

దౌర్జన్యంగా పనుల అడ్డగింత

శివ్వంపేట(నర్సాపూర్): దౌర్జన్యంగా నిర్మాణ పనులను అడ్డుకొన్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపారు. మండల కేంద్రమైన శివ్వంపేటలో గోలి నాగభుషణం, శేట్టిపల్లి భిక్షపతిలకు సంబంధించిన పట్టాభూమిలో నిర్మాణ పనులు చేస్తుండగా బుధవారం మేస్త్రీలను బెదిరించి, పనులు నిలిపివేయించిన ఖాజామొయినుద్దీన్, శివశంకర్లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వీరితో పాటు మరికొందరు ఉన్నారని వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ చెప్పారు.

నలుగురిని బలిగొన్న క్షణికావేశం

- విషం తాగిన భర్త బతకడని భార్య, ఇద్దరు పిల్లలతో ఆత్మహత్య
- ఆ మరుసటిరోజే భర్త మృతి



ఇద్దరు పిల్లలతో ఎల్లం, లక్ష్మి (ఫైల్)

రామాయంపేట (మెదక్) : క్షణికావేశం నాలుగు నిండు ప్రాణాలను బలిగొంది. భార్యాభర్తల మధ్య జరిగిన చిన్నపాటి గొడవే నలుగురి ప్రాణాలను బలి తీసుకుంది. రామాయంపేట మండలం అక్కన్నపేటకు చెందిన కుటుంబం ఆత్మహత్యకు పాల్పడటం కలకలం సృష్టించింది. తెలిసిన వివరాల ప్రకారం.. అక్కన్నపేటకు చెందిన కొడుకు ఎల్లంకు, మెదక్ మండలం వెంకటాపూర్‌కు చెందిన లక్ష్మి (నాగలక్ష్మి)కి ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల లోపు ఆడపిల్లలు శరణ్య, శ్రావ్య ఉన్నారు. ఎల్లంకు తల్లిదండ్రులతోపాటు ఇద్దరు సోదరులున్నారు. అందులో ఎల్లమే పెద్దవాడు. ఎల్లంతోపాటు రెండోవాడు అశోక్‌కు పెళ్లి కాగా, మూడో కుమారుడు రాజుకు పెళ్లి కాలేదు. వారికి వ్యవసాయ భూమి లేకపోవడంతో ఎల్లం, తన చిన్న తమ్ముడు రాజుతో కలిసి హైదరాబాద్‌లో పని చేసుకుంటున్నాడు. కాగా వారిది ఉమ్మడి కుటుంబం. ఒకేచోట కలిసి ఉంటున్నారు. ఎల్లం.. గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉండేవాడు. ఈనెల 12న భార్యాభర్తల మధ్య గొడవ జరుగగా, క్షణికావేశంతో ఎల్లం పురుగుల మందు తాగాడు. వెంటనే అతడిని చికిత్స కోసం మెదక్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఇద్దరు కూతుర్లను తీసుకొని ఆస్పత్రికి వెళ్లిన లక్ష్మికి తన భర్త బతికే అవకాశం లేదని తెలుసుకుంది. దీంతో విలపిస్తూ ఇద్దరు పిల్లలను వెంట తీసుకొని ఆస్పత్రి నుంచి పుట్టింటికి బయలుదేరగా మార్గమధ్యలో కొంటూర్ వద్ద ఆగింది. అక్కడ సమీపాన ఉన్న చెరువులో ఇద్దరు పిల్లలను తోసేసి తానూ నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటికే కోమాలోకి వెళ్లిపోయిన ఆమె భర్త బుధవారం మృతిచెందాడు.

కొడకంచిలో మట్టి అక్రమ తరలింపు



కొడకంచిలో మట్టి తరలింపు ప్రాంతాన్ని చూపుతున్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): కొడకంచిలో క్రషర్ నుంచి భారీగా మట్టిని తరలిస్తున్నారని, దీనిని ఆపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ శ్రీశైలం, గ్రామ నాయకులు భాస్కర్, సాయి, దుబ్బ శ్రీనివాస్, భిక్షపతి తదితరులు డిమాండ్ చేశారు. బుధవారం మట్టిని తరలిస్తున్న ప్రాంతాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రషర్ యజమాని నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతోనే ఈ వ్యాపారం నడుస్తోందని ఆరోపించారు. రాత్రి సమయంలో వందల సంఖ్యలో టిప్పర్‌ల ద్వారా మట్టిని తరలిస్తున్నారన్నారు. ఈ విషయమై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మట్టి తరలింపుపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం



వినయ్‌కుమార్ (ఫైల్)

ఝరాసంగం(జహీరాబాద్): మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. రేగోడ్ మండలానికి చెందిన మమత కుమారులతో కలిసి ఉద్యోగరిత్యా జహీరాబాద్‌లో నివాసముంటున్నది. ఈనెల 19న ఝరాసంగంలో ఉంటున్న అమ్మమ్మ ఇంటికి ఆమె కుమారుడు వినయ్‌కుమార్(19) వచ్చాడు. 20న మధ్యాహ్నం స్నేహితుడి ఇంటికెళ్లి వస్తానని ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో తెలిసిన వారినీ, బంధువులు, స్నేహితులను విచారించినా ఆచూకీ లభించకపోవటంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురు ఆత్మహత్య

వేర్వేరు చోట్ల పలు కారణాలతో ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. నిజాంపేట, చేర్యాల, మెదక్, సిద్దిపేటలో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి.

అప్పుల బాధతో వ్యక్తి..

నిజాంపేట(మెదక్): అప్పుల బాధతో ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నిజాంపేటలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజాంపేటలోని తిరునహరి(అయ్యవారి) శ్రీరాంలు(52) ఆటో డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. ఇటీవల తన కుమార్తె అగు నిఖితకు వివాహం చేశాడు. ఆటో ఫైనాన్స్, పలు ప్రైవేటు నెలవారీ వాయిదాలు చెల్లించలేక అప్పుల బాధతో మనస్తాపం సతమతం అవుతున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి నిద్రించాడు. మరుసటిరోజు ఉదయం కుటుంబసభ్యులు గమనించగా శ్రీరాంలు ఇంట్లో ఉరేసుకొని విగతజీవిగా కనిపించాడు. మృతుడి కుమారుడు ఉదయ్ కిరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు స్థలానికి ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ప్రమీల, కుమార్తె నిఖిత ఉన్నారు.

భార్యతో భర్త గొడవపడి...

చేర్యాల(సిద్దిపేట): భార్యాభర్తల మధ్య గొడవ జరిగి భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు.ఈ ఘటన గడితోటలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, సీఐ తెలిపిన వివరాల ప్రకారం గడితోటకు చెందిన యాట రాజు(30) ఈ నెల 18న భార్యతో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన అతడు గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మరణించారని కుటుంబీకులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు సీఐ సత్యనారాయణరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

యువకుడు...



వెంకట్ (ఫైల్)

మెదక్‌జోన్ : ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఓ యువకుడు బలవన్మరణం చెందిన ఘటన హవేళిఘనాపూర్ మండలం బొగుడ భూపతీపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బత్తుల రాములు కుమారుడు వెంకట్(21) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు వెంకట్ ఎప్పుడు మొబైల్ ఎక్కువగా చూసేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఫోన్ లాక్ ఓపెన్ కాలేదని, దీంతో వెంకట్ చనిపోవటానికి గల కారణాలు తెలియ రాలేదని పోలీసులు చెబుతున్నారు. రాములు దంపతులకు వెంకట్ ఒక్కడే కుమారుడు కావటంతో వారి రోదనలు ఆపటం ఎవరి తరమూ కాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో చెరువులో..

మెదక్‌జోన్: కుటుంబ కలహాలతో చెరువులో పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన హవేళిఘణాపూర్ మండలం వాడిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పాపన్నపేట మండలం రాంతీర్థం గ్రామానికి చెందిన రమేశ్(26) హవేళిఘణాపూర్ మండల పరిధిలోని వాడి గ్రామానికి చెందిన దుర్గయ్య కుమార్తె రేణుకను పెళ్లి చేసుకొని ఇల్లరికానికి వచ్చాడు. కొన్నేళ్లుగా దంపతులు బాగానే ఉన్నారు. కాగా మంగళవారం భార్యతో రమేష్ గొడవ పడ్డాడు. ఈ ఘటనతో మనస్తాపానికి గురై స్థానికంగా ఉన్న చెరువులో రమేష్ దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు మృతదేహాన్ని బయటికి తెచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న హవేలిఘణాపూర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రేణుక, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బావిలో దూకి...



చాంద్ మృతదేహం

సిద్దిపేటఅర్బన్: యువకుడు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మండలంలోని పొన్నాల శివారులో జరిగింది. సిద్దిపేట త్రీటౌన్ సీఐ భానుప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా తామ్సి గ్రామానికి చెందిన చాంద్ (26) దాబాలలో పనిచేస్తుంటాడు. 15 రోజుల క్రితం పొన్నాలలోని ఓ దాబాలో పనికి కుదిరాడు. ఉన్నట్టుండి బుధవారం సాయంత్రం దాబాల సమీపంలోని ఓ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని అతడి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.

కులవృత్తుల ఆర్థిక సాయం ఇప్పిస్తానని టోకరా



విలేకరులతో మాట్లాడుతున్న బాధితులు

నర్సాపూర్: నిరక్షరాస్యుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని మోసం చేశాడు ఓ ప్రబుద్ధుడు.ఈ ఉదంతం పెద్దచింతకుంటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెద్దచింతకుంటకు చెందిన వుల మల్లయ్య, ఆవుల ఎల్లయ్య, ఆవుల సాయిలు, శ్రీనివాస్‌లతో పాటు రెడ్డిపల్లికి చెందిన సాయిలు మంగళవారం నర్సాపూర్‌లో కులవృత్తుల ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసేందుకు వచ్చారు. ఎంపీడీఓ కార్యాలయానికి ఎదురుగా ఉన్న వివేకానంద కాలనీలోని ఓ జిరాక్స్ దుకాణం వద్ద దరఖాస్తు ఫారాలు తీసుకుంటుండగా ఆగంతకుడు వచ్చాడు. తాను ఫారాలు నింపి ఇస్తానని, పైసలు మంజూరయ్యేలా చేస్తానని, అందుకు ఒక్కొక్కరూ రూ.వెయ్యి ఇవ్వాలని అడగ్గా అంగీకరించారు. అతడి మాటలు నమ్మి అందరూ కలిసి ఐదు వేలను ముట్టజెప్పారు. ఫారాలు నింపిన తర్వాత ఫొటోలు తీయాలని చెప్పి శ్రీనివాస్ నుంచి స్మార్ట్ ఫోన్‌ను కూడా తీసుకొని అక్కడి నుంచి ఉడాయించాడు.ఎంత సేపటికీ రాకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు బుధవారం విలేకరులతో జరిగిన మోసాన్ని చెప్పారు. పోలీసులు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

నలుగురికి జరిమానా

రాయపోలు(దుబ్బాక): సెంట్రింగ్ బాక్సుల చోరీ కేసులో నిందితులకు శిక్ష ఖరారు చేస్తూ గజ్వేల్ కోర్టు న్యాయమూర్తి ప్రియాంక తీర్పు వెలువరించినట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్ తెలిపారు. దౌల్తాబాద్‌లో గతేడాది రహీమొద్దీన్ ఇంటి సెంట్రింగ్ బాక్సులు చోరీ అయ్యాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా మేడ్చల్ ప్రాంతానికి చెందిన నలుగురు చోరీ చేసినట్లు తేలింది. వీటిని మేడ్చల్‌లోనే స్క్రాప్ దుకాణంలో విక్రయించారని విచారణలో ఒప్పుకున్నారని ఎస్‌ఐ తెలిపారు. బుధవారం కేసు విచారణకు రాగా నిడుమల ప్రసాద్‌కు 6 నెలలు, వడ్డే శ్రీకాంత్‌కు 3 నెలల జైలుశిక్షను జడ్జి విధించారు. నిందితులు మహ్మద్ షాదుల్లా బాబా, గౌలీకార్ ప్రదీప్ లతోపాటు సెంట్రింగ్ బాక్సులు కొన్న కొంగరి తిరుపతి, మహమ్మద్ మజహరుద్దీన్‌లకు ఒక్కొక్కరికీ రూ.20వేల చొప్పున జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించినట్లు వివరించారు.

తల్లిని కత్తితో పొడిచిన తనయుడు

తొగుట(దుబ్బాక): మద్యంమత్తులో ఉన్న కొడుకు తల్లిని కత్తితో పొడిచిన సంఘటన లింగాపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. తొగుట ఎస్‌ఐ కర్ణాకర్‌రెడ్డి కథనం ప్రకారం గ్రామానికి చెందిన బండారి వెంకటలక్ష్మి (56) భర్త బాలాగౌడ్ 9 ఏళ్ల క్రితం మరణించగా, అత్త సత్తమ్మ, కొడుకు బాలక్రిష్ణాగౌడ్ (35)తో కలిసి ఉంటున్నది. ఆదివారం రాత్రి వెంకటలక్ష్మి నిద్రిస్తున్న ఆమెను లేపి తాగుబోతైన కొడుకు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని గొడవపడ్డాడు. తన వద్ద డబ్బులు లేవని తల్లి చెప్పిన గానీ అతడు వినిపించుకోకుండా కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంకటలక్ష్మిని చికిత్స కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యుల సూచనల మేరకు గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కర్ణాకర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం వెంకటలక్ష్మికి బాగానే ఉంది.

హత్య కేసులో జీవితఖైదు

పటాన్‌చెరు టౌన్: ఓ మహిళ హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుశిక్షను విధిస్తూ సంగారెడ్డి జిల్లా సెషన్ కోర్టు జడ్జి తీర్పునిచ్చారు. పోలీసుల కథనం ప్రకారం పటాన్‌చెరు మండలం ముత్తంగి డీఎస్ కాలనీలో ఉంటున్న వెంకటరాయుడు, లక్ష్మీదేవి అనే మహిళతో కొంతకాలం వివాహేతర సంబంధం ఉంది. అలాగే కొంతకాలంగా డబ్బుల విషయంలోనూ ఇద్దరి మధ్య వివాదం నడిచింది. 2017 నవంబర్‌లో మృతురాలి లక్ష్మీదేవి, నిందితుడు వెంకటరాయుడు ఉంటున్న ఇంటికి సాయంత్రం వెళ్లి ఇవ్వాల్సిన డబ్బులు తిరిగి చెల్లించాలని నిలదీసింది. దీంతో ఇద్దరూ వాగ్వివాదం చేసుకున్నారు. ఈ క్రమంలో ఆమెను నిందితుడు వెంకటరమణ హత్య చేశాడు. మృతురాలి కొడుకు పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి పటాన్‌చెరు సీఐ ప్రభాకర్ దర్యాప్తులో భాగంగా నిందితుడిని రిమాండ్ కు తరలించారు. బుధవారం కేసు విచారణకు రాగా పీపీ శ్రీనివాస్ రెడ్డి వాదనలు విన్న సంగారెడ్డి జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శశిధర్ రెడ్డి, నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతోపాటు రూ.2 వేలు జరిమానా చెల్లించాలని, లేనిపక్షంలో మరో ఆరు నెలలు జైలుశిక్ష విధించాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఐదు బైక్‌లకు ధ్రువపత్రాలు చూపించండి

సిద్దిపేటకమాన్: ఓ కేసు విషయమై ఐదు ద్విచక్ర వాహనాలకు సరైన ధ్రువపత్రాలు న్యాయస్థానంలో చూపించి యజమానులు వీటిని తీసుకెళ్లాలని సిద్దిపేట ఫస్ట్ క్లాస్ అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ శ్రావణియాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహన యజమానులు బైక్‌లకు సంబంధించిన ధ్రువపత్రాలను జులై 26వ తేదీ లోపు సిద్దిపేట న్యాయస్థానంలో చూపించి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. లేనిపక్షంలో వాహనాలను వేలం వేస్తామని హెచ్చరించారు.

ఖాజాపూర్‌లో పట్టపగలే చోరీ



అనుమానితులను ప్రశ్నిస్తున్న ఎస్‌ఐ సుభాష్‌గౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): పట్టపగలే ఇంట్లో దొంగలు రూ. 2లక్షల నగదు దోచుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామానికి గొల్ల శంకరయ్య పెద్దకుమారుడు మల్లేశంకు సొంత ఆటో ఉంది. కిరాయికి వెళుతూ ఉంటాడు. బుధవారం ఆయన ఆటో తీసుకొని బయటకు వెళ్లగా, ఆయన భార్య పక్కింట్లోకి వెళ్లింది. మల్లేశం ఇంటి వద్దకు ఆటో కోసమంటూ కొందరు వచ్చి అక్కడ తచ్చాడుతున్నారు. శంకరయ్య ఎందుకు వచ్చారని అడగగా ఆటో కోసం వచ్చినట్లు తెలిపారు. తర్వాత ఆయన తన చిన్నకుమారుడు ప్రసాద్ ఇంటికి వెళ్లాడు. అప్పటికే మల్లేశం భార్య కూడా ప్రసాద్ ఇంటికే వెళ్లింది. ఇదే అదనుగా భావించిన దుండగులు ఇంట్లో చొరబడి బీరువాను పగలకొట్టి అందులోని నగదును అపహరించుకుపోయారు. మల్లేశం భార్య తిరిగొచ్చేసరికి బీరువా పగలకొట్టి ఉండటాన్ని గుర్తించి, లోపలికి వెళ్లగా ఇంటి లోన్ చెల్లించేందుకు తెచ్చిన రూ. 2 లక్షలు బీరువాలో కనిపించలేదు. స్థానికులు ఆరుగురిని పట్టుకోగా, మరొకరు అప్పటికే గ్రామం దాటినట్లు చెబుతున్నారు.ఈ చోరీపై పోలీసులకు సమాచారం అందించారు.

కేబుల్ వైర్‌ల చోరీకి విఫలయత్నం

గజ్వేల్‌రూరల్: బోరుబావుల వద్ద మోటార్ కేబుల్ వైర్ల చోరీకి విఫలయత్నం చేసిన ఇద్దరిని గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. రిమ్మనగూడలో బోరుబావుల వద్ద విద్యుత్ మోటార్లకు సంబంధించిన కేబుల్ వైర్‌లను చోరీకి ప్రయత్నిస్తున్న ఇద్దరిని పట్టుకొని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేబుల్ వైర్ చోరీ

మిరుదొడ్డి(దుబ్బాక): బోరు మోటారుకు చెందిన కేబుల్ వైర్ మండల పరిధిలోని అల్వాలలో బుధవారం చోరీకి గురైంది. మిరుదొడ్డి ఎస్‌ఐ శ్రీధర్‌గౌడ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన బొమ్మ చిన్న లింగం వ్యవసాయ పొలంలో సుమారు రూ. 5 వేల విలువ కలిగిన బోరు మోటారు కేబుల్ వైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

తమ్ముడి హత్యాయత్నం

జహీరాబాద్ టౌన్: ఆస్తి కోసం అన్నపై హత్యాయత్నం చేసిన తమ్ముడు కటకటాలపాలయ్యాడు. జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ.శ్రీకాంత్ కథనం ప్రకారం పట్టణంలోని అల్లీపూర్ బాలాజీనగర్‌కు చెందిన మెట్టు పెంటయ్యకు నర్సింలు, నరేష్, సురేష్ ముగ్గురు కొడుకులున్నారు. నరేష్, సురేష్ తాగుడుకు బానిసై నిత్యం గొడవపడుతుండగా, అన్న నర్సింలు పెళ్లిచేసుకుని మహీంద్ర కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. సురేష్ ఇంటిని అమ్మి పెళ్లి చేయాలని తల్లిని వేధిస్తుండగా.. అన్న నరేష్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. తనకు అన్న నరేష్ అడ్డు తగులుతున్నాడని భావించి హత్య చేయాలని సురేష్ ప్లాన్ వేశాడు. కాగా, మే 28న రాత్రి నరేష్ మద్యంతాగి ఇంటికొచ్చి నిద్రిస్తున్నాడు. అదే అదనుగా భావించిన సురేష్ కత్తితో నరేష్ గొంతు కోసి పరారయ్యాడు. వెంటనే నరేష్‌ను కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. సోదరుడు నర్సింలు ఫిర్యాదు మేరకు నరేష్‌పై హత్యాయత్నం చేసిన సురేష్‌ను బుధవారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

చినుకు చింత

- 20 రోజులుగా ముఖం చాటేసిన వరుణుడు
- తొలకరి వర్షాలకు నాటగా మొలకెత్తి ఎండిన విత్తనాలు
- 80 శాతం మేర పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ సాగు
- మొలకలు దెబ్బతినడంతో ఆందోళనలో రైతాంగం



సోయాబీన్ పంటకు స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందిస్తున్న దృశ్యం

జహీరాబాద్: మృగశిర కార్తె ప్రవేశానికి ముందే వచ్చిన తొలకరి వర్షాలు రైతులను మురిపించి మాయమయ్యాయి. ఊరించిన వర్షాలకు సంతోషపడిన రైతాంగం విత్తనాలను ముమ్మరంగా నాటారు. వర్షాలు రాకుండా పోతాయా అన్న నమ్మకంతో విత్తనాలు నాటారు. విత్తనాలు వేసి పక్షం రోజులు కావడంతో మొలకెత్తి ఎండిపోయాయి. భూమిలో తేమకు అక్కడక్కడ మొలకెత్తిన మొక్కలు కూడా ఎండిపోయాయి. పంటలు వేసుకునేందుకు భారీగా పెట్టిన పెట్టుబడులు తిరిగిరాకుండా పోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- జిల్లాలో రైతులు ప్రధానంగా పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ విత్తనాలను సుమారు 80 శాతం మేర వేసుకున్నారు. అత్యధికంగా పత్తి సాగు చేపట్టారు.
- జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్ ప్రాంతాల్లో పత్తి సాగుకు వైపు ఆసక్తి చూపారు. ముందస్తుగా కురిసిన వర్షాలకు భూమిలో తేమ ఉండడం, అందుకు తోడు తొలకరి వర్షాలు పండటంతో రైతులు ముమ్మరంగా పత్తి విత్తనాలు నాటుకున్నారు. మరికొందరు మొక్కజొన్న, సోయాబీన్ పంటలు వేసుకున్నారు.
- గతంలో ఎన్నడూ లేని విధంగా వర్షాలు ఎక్కువ రోజులు గ్యాప్ రావడంతో వేసిన విత్తనాలు దెబ్బతిన్నాయని రైతులు అంటున్నారు.

పంటను కాపాడుకునేందుకు పాట్లు

- వ్యవసాయ బావులు, బోర్ల కింద నీటి సదుపాయం ఉన్న రైతులు మాత్రం పంటలను కాపాడుకునేందుకు పాట్లు పడుతున్నారు. స్ప్రింక్లర్ల ద్వారా నీటి తడులు అందిస్తున్నారు.
- ఇది కూడ కొద్దిపాటి విస్తీర్ణంలో ఉన్న పంటలకే నీటిని అందించడం సాధ్యపడుతోందని రైతులు చెబుతున్నారు. నీరు పెట్టినా తీవ్ర ఎండలకు తేమ అప్పుడే ఆరిపోతోందన్నారు.

7.19 లక్షల ఎకరాల్లో పంటల సాగు అంచనా

- వర్షాకాలంలో జిల్లాలో 7.19 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో పత్తి 3,50,936 ఎకరాల్లో సాగు కానుందని అంచనా.
- వరి 1,38,380 ఎకరాల్లో, కంది 83,791 ఎకరాల్లో, సోయాబీన్, 81,978 ఎకరాల్లో, మొక్కజొన్న 16,502 ఎకరాల్లో, పెసర 13,562 ఎకరాల్లో, మినుము 6,275 ఎకరాల్లో, జొన్న 841 ఎకరాల్లో సాగు అయ్యే అవకాశం ఉంది.
- పత్తి, కంది పంటలు అమీన్‌పూర్, జిన్నారం మండలాల్లో, వరి జహీరాబాద్ నియోజకవర్గంలో తప్ప మిగతా అన్ని నియోజకవర్గాల్లో సాగుకానుంది. సోయాబీన్ జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్ ప్రాంతాల్లో మాత్రమే సాగు అవుతుంది. మొక్కజొన్న జహీరాబాద్ నియోజకవర్గంలోనే అత్యధికంగా సాగు కానుంది.

రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టా



తొలకరి వర్షాలు పడటంతో విత్తనాలు వేశాను. పత్తి పంట 35 ఎకరాల్లో, మొక్కజొన్న 20 ఎకరాల్లో, సోయాబీన్ ఏడు ఎకరాల్లో వేసుకున్నాను. భూమిలో ఉన్న తేమకు మొలకలు వచ్చాయి. ఎండల తీవ్రతతో వచ్చిన మొలకలు ఎండి పోయాయి. పంటల సాగు కోసం రూ.2 లక్షల మేర పెట్టుబడులు పెట్టాను. గత ఏడాది అధిక వర్షాలతో పత్తి, సోయాబీన్ పంటలు దెబ్బతిని సుమారు రూ.4 లక్షల మేర నష్టపోయాను.

– కొత్త అంజిరెడ్డి, రైతు, కోహీర్

సోయాబీన్ దెబ్బతిన్నది



రెండు ఎకరాల్లో సోయాబీన్ పంట వేశాను. ఇప్పుడు వర్షాలు కురియడం లేదు. దీంతో పంట మొలకెత్తి ఎండిపోయింది. తిరిగి విత్తనాలు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తరపున ఉచితంగా విత్తనాలు అందజేసి రైతులను ఆదుకోవాలి.

– రాజ్‌కుమార్, రైతు–రంజోల్

వర్షాలు కురిసిన తర్వాతే విత్తుకోవాలి



తగినంత వర్షం కురిసిన తర్వాతే విత్తనాలు వేసుకోవాలి. రైతులు పాత సాంప్రదాయం ప్రకారం విత్తనాలు వేస్తున్నారు. పొడి మట్టిలో విత్తుకుంటే తగినంత మొలకలు రావు. రెండు వర్షాలు కురిసిన తర్వాత రైతులు విత్తనాలు వేసుకోవాలి. అప్పుడే వంద శాతం మొలకలు మొలుస్తాయి. విత్తనాలు వేసుకునేందుకు ఈ నెలాఖరు వరకు సమయం ఉంది.

– నర్సింహారావు, జిల్లా వ్యవసాయాధికారి సంగారెడ్డి